క్లుప్తంగా

అర్చకుడిపై దాడి బాధాకరం



మధురానగర్(విజయవాడసెంట్రల్): తెలుగు రాష్ట్రాలలో ఆలయాలు, హిందూ మతానికే కాకుండా, అర్చకులకు రక్షణ లేకుండా పోతోందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడిపై దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. దేవుడి సేవలో ఉన్న అర్చకుడిపై దాడి దారుణమని, సమాజం బాగుండాలని నిత్యం కైంకర్యాలు, పూజలు నిర్వహించి దైవ దూతలుగా భావించే అర్చకులపై వరుస దాడులు కలచి వేస్తున్నాయన్నారు. చిలుకూరు ఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్చకులకు సరైన రక్షణ కల్పించి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని మల్లాది విష్ణు కోరారు.

గుర్తింపు కార్డుల పంపిణీ



పాయకాపురం(విజయవాడరూరల్): ఆజాద్ ముస్లిం కమిటీల్లో ప్రతినిధులుగా ఉంటూ సేవాకార్యక్రమాలు నిర్వహించే వారికి గుర్తింపు కార్డులను అందజేస్తామని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అన్నారు. ఆదివారం కండ్రికలో జరిగిన కార్యక్రమంలో విజయవాడ నగర కమిటీ ప్రతినిధులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాద్ ముస్లిం కమిటీలో సభ్యత్వం కలిగిఉన్న ప్రతి ఒక్కరూ ముస్లిం మైనార్టీలకు సేవలందించడంలో ఆసక్తి ఉన్నవారిని గుర్తించి సభ్యులుగా చేర్చాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆజాద్ కమిటీ బలోపేతం కావాలని సూచించారు. ఈ నెలలో పేద ముస్లింలకు కూరగాయాలు విక్రయించుకునేందుకు మొబైల్ బండ్లు అందజేయనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ, రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ మౌలాలి, నగర అధ్యక్షుడు సిలార్ బేగ్, సెంట్రల్ యూత్ అధ్యక్షుడు అన్వర్ బేగ్, మాదుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ నాగూర్‌బాషా, మసీదు పెద్దలు షేక్ ఖాజా, అజీజ్ బేగ్ పలువురు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు



పాయకాపురం(విజయవాడరూరల్): ఉచిత వైద్యసేవలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం రాజీవ్‌నగర్లోని రాజీవ్‌గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో స్పందన సేవా సమితి, స్పందన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు బీపి, షుగర్, కీళ్ళ నొప్పులు, గుండె సంబంధిత వ్యాధులు, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, ఈసీజీ పరీక్షలు 300 మందికి నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తొలుత ఇంటర్నేషనల్ వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ విజయలక్ష్మి వాకర్స్ ఫౌండర్ ఆళ్వార్ దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్పందన సేవా సమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రూ.25 వేల విలువగల మందులను ఉచితంగా అందజేశామన్నారు. రూ.18 వేల విలువగల కళ్లజోళ్లను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎం.తిరుపతమ్మ, సమితి ప్రధాన కార్యదర్శి డి.మురళి, సభ్యులు ఎల్.దుర్గ, భాగ్యలక్ష్మి, మోహన్, బాలాజీ, డాక్టర్ బ్రహ్మదేశం, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గణితంలో ప్రతిభ కనబరచాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గణితంలో చక్కటి ప్రతిభ కనబరిస్తే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు చలసాని సాంబశివరావు అన్నారు. ఆదివారం బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో 'చదువంటే మాకు ఇష్టం' కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులకు గణితంలో మెలకువలు నేర్పించారు. స్పీడ్ మ్యాథ్స్ ప్రాక్టీస్ చేయించారు. లెక్కలను సులువుగా ఏ విధంగా చేయాలో నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దృష్టి పెడితే గణితంలో పట్టు సాధించవచ్చన్నారు. టెక్నిక్స్ నేర్చుకుంటే సబ్జెక్ట్ ఎంతో సులువుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్కులకు రక్షణ కరువు

- ఆకతాయిలకు అడ్డాగా ఉద్యానవనాలు
- కనీసం ప్రహరీ నిర్మించని వైనం..
- పెరుగుతున్న చోరీలు
- బెంబేలెత్తుతున్న ప్రజలు



ప్రహరీ లేని పసుపుతోట గద్దే వెంకట్రామయ్య ఉద్యానవనం



ఎన్టీఆర్ ఉద్యానవనం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆకతాయిలకు అడ్డాగా ఉద్యానవనాలు (పార్కులు) మారుతున్నాయి. అధికారుల ఉదాసీన వైఖరి కారణంగా సామాన్యప్రజలు సేదతీరే పరిస్థితులు లేకుండా పోతున్నాయి.

విషయం ఇదీ..

మధురానగర్ పసుపుతోట గద్దే వెంకట్రామయ్య ఉద్యానవనం, పప్పులమిల్లు సెంటర్‌లోని ఎన్టీఆర్ ఉద్యానవనం ఆకతాయిలకు అడ్డాగా మారింది. ఇక్కడ రాత్రయ్యేసరికి ఆకతాయిలు, గంజాయి బ్యాచ్ ఉద్యానవనాలకు చేరుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే వాగ్వాదానికి దిగుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం మద్యం సేవిస్తూ, గంజాయి తాగుతూ వారు చేస్తున్న ఆగడాలకు ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కు మంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ఉద్యానవనాలకు సమీపంలో రైల్వే ట్రాక్, రైవస్ కాలువ ఉండటంతో పోలీసులు వచ్చినప్పుడు సులభంగా తప్పించుకోగలుగుతున్నారు.

భద్రత కరువు..

పసుపుతోట గద్దే వెంకట్రామయ్య ఉద్యానవనంకు ఆర్‌యూబీ పనులలో భాగంగా ప్రహరీ తొలగించారు. పనులు పూర్తయినా ప్రహరీ మాత్రం నిర్మించలేదు. దీంతో ఎవరికి వారు ఇష్టారాజ్యంగా ఉద్యానవనంలోకి ప్రవేశిస్తున్నారు. ఆకతాయిలతో పశువులు సైతం ఉద్యానవనంలోకి చేరుకుని మొక్కలు, వస్తువులను పాడు చేస్తున్నాయి. ఈ విషయమై సాక్షి ప్రచురించిన కథనాలకు స్పందించిన అధికారులు ప్రహరీ నిర్మాణానికి కొలతలు తీశారు. కానీ నేటికీ పనులు మాత్రం జరగలేదు. రక్షణగోడ లేకపోవటంతో ఆకతాయిలు ఉద్యానవనంకు చేరుకోవటంతో పాటు అడ్డుకుంటున్న వాచ్‌మెన్‌పై దాడికి పాల్పడుతున్నారు. ఇప్పటికే పలుమార్లు వాచ్‌మెన్‌ను ఆకతాయిలు కొట్టిన సందర్భాలు అనేకం ఉన్నాయి.



ఆకతాయిలు పడేసిన బాటిళ్లు

ఎన్టీఆర్ ఉద్యానవనంలో..

మధురానగర్ పప్పులమిల్లు రైల్వేగేటు సమీపంలోని ఎన్టీఆర్ ఉద్యానవనం మందుబాబులకు అడ్డాగా మారింది. ఇక్కడ నిత్యం మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇక్కడ ఆకతాయిలు ప్రహరీకి ఉండే జాలీలను సైతం పగుల కొట్టారు. దీంతో రాత్రిపూట ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటేనే హడలిపోతున్నారు.

పెరుగుతున్న చోరీలు..

పసుపుతోట గద్దే వెంకట్రామయ్య ఉద్యానవనం, మధురానగర్ ఎన్టీఆర్ ఉద్యానవనం సమీపంలోని సాయిబాబా కాలనీ, రైల్వే కాలనీ తదితర ప్రాంతాలలో చోరీలు అధికంగా జరుగుతున్నాయి. ఆకతాయిలు ద్విచక్రవాహనాలు, వాహనాలలోని పెట్రోల్, బ్యాటరీలతో పాటు అందిన కాడికి చోరీ చేస్తున్నారు. మద్యం గంజాయి మత్తులో చోరీలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రక్షణ గోడ నిర్మించి.. పచ్చదనం పెంచాలి



గద్దే వెంకట్రామయ్య ఉద్యానవనంకు రక్షణగోడ నిర్మించాలి. రక్షణ గోడ లేకపోవటంతో ఒక వైపు రైల్వే ట్రాక్, రైల్వేకాలనీ తదితర ప్రాంతాల నుంచి ఆకతాయిలు ఇక్కడకు చేరుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. చుట్టు పక్కల ప్రాంతాలలో అందినకాడికి పట్టుకు పోతున్నారు. రక్షణ గోడ నిర్మించటం వల్ల భద్రత పెరుగుతుంది. ఉద్యానవనంలో పచ్చదనం పెంచి ఆటపరికరాలు ఏర్పాటు చేయాలి.

– లంకా నాయుడు, స్థానికుడు

ఎన్నికల కోడ్ ముగియగానే పనులు

గద్దె వెంకటరమాయ్య ఉద్యానవనానికి ప్రహరీ నిర్మాణానికి, ఇతర అవసరాలకు రూ.12 లక్షలు మంజూరయ్యాయి. ఎన్నికల కోడ్ కారణంగా పనులు మొదలు పెట్టలేదు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత పనులు చేపడతాం. ఎన్టీఆర్ పార్కువద్ద పరిస్థితులను పరిశీలిస్తాం. అవసరమైన రక్షణ చర్యలు తీసుకుంటాం.


– చంద్రశేఖర్, ఈఈ, పార్కు విభాగం

శ్రీదత్తసాయికి భక్తిశ్రద్ధలతో వార్షికోత్సవ పూజలు

3 వేల మందికి అన్నప్రసాద వితరణ



లక్ష్మీగణపతి హోమం పూర్ణాహుతి



దత్తసాయి మందిరంలో బాబా వారు

మధురానగర్(విజయవాడ సెంట్రల్): పసుపుతోట శ్రీ దత్తసాయి మందిరం 10వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగాయి. బాబా వారికి 21 దివ్య ద్రవ్యములతో విశేషంగా అభి షేకం, అన్నాభిషేకం నిర్వహించారు. లోక కల్యాణార్థం జోస్యుల బాలకృష్ణ శర్మ నేతృత్వంలో లక్ష్మీగణపతి హోమం, శ్రీసాయి నక్షత్ర మాలిక 11వ మహాయజ్ఞం 54వ పర్వం పూర్ణాహుతి జరిగింది. మధ్యాహ్నం మూడు వేల మందికి అన్న ప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం బాబా వారి పారాయణం ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకుడు తంగెళ్ల మూడి వీరమోహనరావు పర్యవేక్షించారు.

గంజాయి కేసులో నిందితుల అరెస్ట్



పోలీసుల సమక్షంలో నిందితులు ప్రశాంత్, సునీత (ముసుగులున్నవారు), టేబుల్‌పై గంజాయి

విజయవాడస్పోర్ట్స్: నగరంలోని సింగ్‌నగర్, నందమూరినగర్ ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.50 వేలు ఖరీదు చేసే తొమ్మిది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సిటీ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ సీఐలు శ్రీధర్‌కుమార్, నాగశ్రీనివాస్ ఆదివారం వెల్లడించారు. సింగ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీకి చెందిన చేబ్రోలు నవీన్ బాలప్రశాంత్ ఐటీఐ పూర్తి చేశాడు. వస్త్ర దుకాణంలో పని చేస్తూ.. తరుచూ ఈవెంట్‌లకు ఫొటోలు తీసేందుకు వెళ్లే వాడు. ఓ ఈవెంట్‌లో నందమూరినగర్‌కు చెందిన యోగానంద సునీత పరిచమైంది. ప్రశాంత్‌కు అప్పటికే గంజాయి సేవించే అలవాటు ఉండటంతో సునీత ఇంటికి వెళ్లి గంజాయి సేవిస్తుండేవాడు. అదే సమయంలో గంజాయి తీసుకొచ్చి విక్రయించాలనే ఆలోచన ఇద్దరికీ వచ్చింది. ఆంధ్ర- ఒరిస్సా సరిహద్దుల్లోని గ్రామాల్లో కొనుగోలు చేసిన గంజాయిని విజయవాడ తీసుకొచ్చి విక్రయిస్తూ వచ్చిన సొమ్ముతో ఇరువురూ జల్సాలు చేయడం మొదలెట్టారు. గుట్టుగా సేకరించిన సమాచారంతో గంజాయి విక్రయాలు జరుపుతున్న ఇద్దరినీ నందమూరినగర్‌లో అరెస్ట్ చేసినట్లు సీఐలు వెల్లడించారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. గంజాయి అక్రమ రవాణా, సాగు, విక్రయించడం, సేవిస్తున్నట్లు తెలిస్తే వెంటనే 91211 62475కు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా జిల్లా ప్రజలను వారు కోరారు.

దుర్గమ్మ దర్శనానికి పెరిగిన రద్దీ

- ఆర్జిత సేవలకు డిమాండ్
- సర్వ దర్శనానికి రెండు గంటల సమయం



అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఇంద్రకీలాద్రికి తరలి వచ్చి ఆది దంపతులను దర్శించుకున్నారు. ఆదివారం, మాఘమాసం నేపథ్యంలో భక్తుల రద్దీ పెరిగిందని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. అమ్మవారికి నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారు జామున జరిగిన ఖడ్గమాలార్చనలో 29 మంది, చండీహోమంలో 96 మంది, లక్ష కుంకుమార్చనలో 27 మంది, శ్రీచక్రనవార్చనలో 11 మంది, అమ్మవారి సుప్రభాత సేవలో 17 మంది, పంచ హారతుల సేవలో 23 మంది, సూర్యోపాసన సేవలో 8 మంది ఉభయదాతలు పాల్గొన్నారు.

మధ్యాహ్నం వరకు రద్దీ..

మరో వైపున పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులతో ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు కిటకిటలాడాయి. సర్వ దర్శనానికి రెండు గంటల సమయం పట్టగా, రూ.500 అంతరాలయ దర్శనానికి గంటకు పైగా సమయం పట్టింది. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అర్ధగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. మహా నివేదన అనంతరం దర్శనాలు తిరిగి ప్రారంభం కాగా మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు రద్దీ కొనసాగింది. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవలో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు.

దండమూడి సంగీత సేవలు ఆదర్శం



పురస్కార గ్రహీతలతో సంగీత విద్వాంసులు శ్యామసుందర్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

విజయవాడకల్చరల్: దండమూడి రామ్మోనరావు సంగీత సేవలను నేటి యువ సంగీత విద్వాంసులు ఆదర్శంగా తీసుకోవాలని విఖ్యాత వీణా విద్వాంసులు అయ్యగారి శ్యామసుందర్ అన్నారు. శ్రీ దండమూడి లయవేదిక 25వ వార్షికోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో ఆదివారం 8 మంది మృదంగ విద్వాంసులకు ఆత్మీయ సత్కారం, శతాధిక మృదంగ లయ విన్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్యామసుందర్ మాట్లాడుతూ మృదంగమే జీవితంగా గడిపిన వ్యక్తి రామ్మోహనరావు అని అభివర్ణించారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ప్రతి తెలుగువాడు గర్వించదగ్గ వ్యక్తి అని కొనియాడారు. 25వ వార్షికోత్సవం సందర్భంగా మృదంగ విద్వాంసులు కామరాజు విష్ణుమూర్తి, వంకాలయ వెంకటరమణ మూర్తి, ధూళిపాళ శ్రీరామమూర్తి, మండపాక నాగలక్ష్మి, బీవీఎస్ ప్రసాద్, కొమ్మా జోస్యుల సద్గురు చరణ్, గంటుకు వెంకట్రావ్, తిరునగరం ప్రభాకరరావు, పున్నమరాజు మురళీ కృష్ణలను ఆత్మీయంగా సత్కరించారు. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మృదంగ విద్వాంసులు లయ విన్యాసంలో పాల్గొన్నారు.

మేరీమాత తిరునాళ్లలో నేటి కార్యక్రమాలు



ఉదయం

- 6.30 గంటలకు – ఉదయకాల ప్రార్ధన
- 7.00 గంటలకు – సమష్టి దివ్యబలి పూజ
- 10.00 గంటలకు – పవిత్రాత్మ నూత్నీకరణ ప్రార్ధనలు
- 10.30 గంటలకు – క్రైస్తవ భక్తి గీతాలు
- 11.30 గంటలకు – దేవాలయంలో సమష్టి దివ్యబలి పూజ
- 11.30 గంటలకు – సాంస్కృతిక కార్యక్రమాలు

మధ్యాహ్నం

- 12.30 గంటలకు – నిరీక్షణ యాత్రికుల నాటిక
- 1.00 గంటలకు – పవిత్రాత్మ నూత్నీకరణ ప్రార్ధనలు
- 1.30 గంటలకు – కోలాటం
- 3.00 గంటలకు – దివ్యబలి పూజ

సాయంత్రం

- 5.00 గంటలకు – జపమాల
- 6.00 గంటలకు – సమష్టి దివ్యబలి పూజ

రాత్రి

- 8.30 గంటలకు – దేవుని కరుణ నృత్యరూపకం
- 10.00 గంటలకు – సంసోను – డెలీల బుర్రకథ
- 11.30 గంటలకు – యేసుకృప – నాటకం

– గుణదల(విజయవాడతూర్పు)

ముగిసిన జాతీయ హాస్య నాటికోత్సవాలు

సినీ నటుడు సుబ్బరాయశర్మకు జంధ్యాల స్మారక పురస్కారం

విజయవాడ కల్చరల్: సుమధుర కళానికేతన్ 51వ వార్షికోత్సవం సందర్భంగా మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో నిర్వహిస్తున్న 27వ జాతీయ హాస్యనాటికోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉదయం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను సుమధుర కళానికేతన్ సభ్యుడు పీఎస్ అవధాని ప్రారంభించారు. పద్మశ్రీ హేమంత్, సీహెచ్ అజయ్‌కుమార్ బృందం నిర్వహించిన నృత్య కార్యక్రమాలు, సిద్ధార్థ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన లఘునాటికలు సందేశాత్మకంగా సాగాయి. సాయంత్రం పోటీ నాటికలలో భాగంగా యంగ్ థియేటర్స్ విజయవాడ వారు యువ దర్శకుడు వాసు దర్శకత్వంలో ప్రేమ- పిచ్చి నాటికను ప్రదర్శించారు. రెండవ నాటికగా మల్లాది క్రియేషన్స్ హైదరాబాద్ వారి ఆవేశంలో 'ఆనందం' నాటికను. యువ కళాకారులను ప్రోత్సహిస్తూ 'కదం కదం పర్' నాటికను ప్రదర్శించారు. 2025 సంవత్సరానికి గానూ రంగస్థల సినీ నటుడు సుబ్బరాయశర్మకు జంధ్యాల స్మారక పురస్కారాన్ని నిర్వాహకులు అందజేశారు. సుమధుర అధ్యక్షుడు సామంతపూడి నరసరాజు, ప్రధాన కార్యదర్శి పీ భాస్కరశర్మ, నిర్వాహకులు డాక్టర్ కైలాసరావు, పీఎస్ఎన్ మూర్తి. పరిషత్ చైర్మన్ డాక్టర్ ఎస్.మురళీకృష్ణ పాల్గొన్నారు. నాటికల పోటీలకు రంగస్థల ప్రయోక్తలు మిశ్రో, సుబ్బరాయశర్మ, కోట శంకరరావు పాల్గొన్నారు. నాటికల పోటీలో విజేతలకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.

ఘనంగా సంగీత దర్శకుడు సుసర్ల జయంతి



అన్నవరపు రామస్వామిని సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: సుస్వరాల సంగీత దర్శకుడు సుసర్ల దక్షిణామూర్తి అని సంగీత విద్వాంసుడు అన్నవరపు రామస్వామి అన్నారు. హైదరాబాద్‌కు చెందిన సుసర్ల సంగీత వాహిని, తెలుగు కళావాహిని, పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద ఆదివారం సుసర్ల 104వ జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి, అన్నవరపు రామస్వామికి 'సుసర్ల అవార్డ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. రామస్వామి మాట్లాడుతూ త్యాగరాజ స్వామి గురుపరంపరకు చెందిన సుసర్లను నేటి సంగీత కళాకారులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సుసర్ల సంగీత వాహిని అధ్యక్షుడు సుసర్ల రామారావు, నిర్వాహకులు నాగమణి, న్యాయవాది చీదెళ్ల నాగేశ్వరరావు, రచయిత ప్రభాకర్, చింతకాయల చిట్టిబాబు, గోళ్ల నారాయణరావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ వెన్నా వల్లభరావు తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు అన్నవరపు రామస్వామికి సుసర్ల దక్షిణామూర్తి స్మారక పురస్కారం అందజేశారు. గాయనీ గాయకులు, సుసర్ల దక్షిణామూర్తి చిత్రాలలోని గీతాలను ఆలపించారు.

సూర్య భగవానుడికి పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాఘ మాసం ఆదివారం పురస్కరించుకుని లోక కల్యాణార్థం శ్రీ శివజ్ఞాన పీఠంలో లక్ష తామరపూసల అర్చన జరిగింది. పీఠాధిపతి శివాచార్య స్వామి సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సూర్య నమస్కారాలు, సహస్రతిన హోమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం



శివాలయం రోడ్డు పక్కన వ్యర్థాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే మధురానగర్ పప్పుల మిల్లు రైల్వే గేటు శివాలయం వీధిలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఇక్కడ రోజుల తరబడి చెత్తను తరలించటం లేదు. ఎవరికి వారు చెత్తాచెదారాన్ని ఇష్టారాజ్యంగా ఇక్కడ వేస్తున్నారు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతున్నాయి. చెత్తాచెదారం వల్ల దుర్వాసనతో పాటు దోమలు సైతం విజృంభిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. గుడికి వెళ్లే దారిలో కనీసం శుభ్రం చేయకపోవటం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆటో డ్రైవర్‌కు గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఆటోడ్రైవర్ గాయపడిన ఘటన గుణదల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఆదివారం గుణదల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామ కృష్ణాపురానికి చెందిన మస్తాన్‌వలి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 1వ తేదీన ఎనికేపాడులోని ఫంక్షన్‌కు స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. ఫంక్షన్ నుంచి తిరిగి వస్తున్న క్రమంలో బీఆర్టీఎస్ రోడ్డు ఆంజనేయస్వామి విగ్రహం వద్దకు చేరుకునేసరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మస్తాన్ వలీని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరియమాతకు నీరాజనం







గుణదలలో మేరీ మాత ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల తొలిరోజైన ఆదివారం భక్తులు లక్షలాదిగా పుణ్యక్షేత్రానికి తరలివచ్చారు. మరియతల్లిని భక్తులు దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. దీంతో గుణదల కొండపై ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయ గురువులు ప్రత్యేక ప్రార్ధనలు చేసి భక్తులను ఆశీర్వదించారు. అనంతరం సమష్టి దివ్యపూజాబలి సమర్పించి, భక్తులకు దివ్య సత్ప్రసాదాన్ని అందజేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ